ఇంతదాకా వాళ్ళు అడిగే కాగితాలు, ఫైళ్ళు వెదికి ఇస్తూ అలసిపోయాను. రేపు వెళ్దాం అన్నాను' అన్నాడు.

'అలాగా? ఇంతకీ సినిమా ఎలా వుంది?' అని అడక్కుండా వుండలేకపోయాను, ఆయన భార్య గురించి తెలుసుకాబట్టి.

ఊరికే అనలేదు పెళ్ళయిన రోజు మగాడి వయసు ఏడేళ్ళు పెరుగుతుందని. కాని పెళ్ళి జలుబులాంటిది. జీవితంలో ఓసారయినా రాక తప్పదు.

'నేనెన్నడూ విడాకుల గురించి ఆలోచించలేదు. హత్య? ఆలోచించాను!' పెళ్ళయిన ఓ కామెడి నటుడి మాటలివి. అతని పేరుమాత్రం అడక్కండి.

# ది డెత్ ఆఫ్ లిబర్టి

ప్రతి వూరికి ఈ ఫేజ్ వుందో లేదో నాకు తెలీదు కాని హైద్రాబాద్ నగరానికి మాత్రం వుంది. పాత సినిమాహాళ్ళని రెనొవేషన్ చేసి, అంటే ఎయిర్ కండిషన్డ్ చేసి, మంచి కుర్చీలు వేసి అది మళ్ళీ తెరవడం.

ఇంకో ఫేజ్ పాత సినిమా థియేటర్లని పూర్తిగా పడగొట్టి ఆ స్థానంలో అపార్ట్‌మెంట్స్ నిర్మించడం. మినర్వా, ప్లాజా సినిమా థియేటర్లని సమూలంగా పడగొట్టి స్కై స్క్రేపర్స్ నిర్మించారు. ఈ దెబ్బ లిబర్టీ సినిమా థియేటర్ మీద కూడా పడింది.

హైద్రాబాద్ తెలిసిన వాళ్ళందరికి లిబర్టి సినిమా థియేటర్ తెలుసు. కనీసం ఆ పేరయినా విని వుంటారు. మొన్న అటు వైపు వెళ్తూ చూస్తే ఆ థియేటర్ వుండాల్సిన చోట మొండి గోడలు కూడా లేవు. మొత్తం పూర్తిగా పడగొట్టారు. క్షణకాలం మనస్సు చివుక్కుమంది.

1966 లో ఒక సంవత్సరం పాటు నేను హైద్రాబాదులోని వివేకవర్ధిని కాలేజీలో బి.కాం. మొదటి సంవత్సరం చదివాను. రాష్ట్రపతి రోడ్

లోని పేట్నీ సర్కిల్ నించి కోటికి నంబర్ సెవెన్ బస్ ఎక్కి వెళ్తుంటే టేంక్‌బండ్ దాటి బస్సు ఎడమవైపు తిరగగానే 'లిబర్టి. లిబర్టి వుత్తర్నా. లిబర్టి' అనేవాడు కండక్టర్. లిబర్టి సినిమా వల్ల ఆ బస్‌స్టాప్‌కి వచ్చిన పేరు అది. బస్‌స్టాప్‌కి సినిమా థియేటర్ పేరుండంటే ఆ చుట్టుపక్కల ఇంకేం లేండ్‌మార్క్స్ లేవనేగా అర్థం. అప్పట్లో ఆ బస్‌స్టాప్‌లో ఆర్.టి. సి. వాళ్ళకి ఓ చిన్న కేబిన్, అందులో ఓ కంట్రోలర్ వుండేవారు. అక్కణ్నించి వెళ్ళే ప్రతి బస్ కండక్టరు దిగి కంట్రోలర్ సంతకం తీసుకుంటూండేవారు.

ఇప్పటికీ ఆ బస్‌స్టాప్ పేరు లిబర్టి.

ఆ లిబర్టి బిల్డింగ్‌లోనే 'ఎంబసి' అనే సినిమా థియేటర్ వుండేది. అది అప్పట్లో జంటనగరాలన్నిటిలోని అతిచిన్న సినిమా థియేటర్. వంద మంది కూడా పట్టేవారు కాదు. కేవలం ఇంగ్లీషు సినిమాలే ఆడేవి. నేను డాక్టర్ నో చూసింది ఆ థియేటర్‌లోనే. ఆ తర్వాత చాలా ఇంగ్లీషు సినిమాలు (ది కిల్లర్స్, ఫ్రాంకెన్‌స్టైన్ పేర్లు వెంటనే గుర్తొచ్చాయి) ఎంబసిలో కాలేజీ ఎగ్గొట్టి చూసాను. ఆ సినిమా థియేటర్‌కి వచ్చేవాళ్ళ మొహాలు ఒక్కటే. అంటే కొందరే ఎంబసికి వస్తుండేవారు.

ఇరవై ఏళ్ళక్రితం అనుకుంటా 'ఎంబసి'ని మూసేసి దాన్ని గోడౌన్ చేసేసారు. ఎంబసి ఫస్ట్ ఫ్లోర్‌లో వుండేది. ఎంబసిని ఆనుకుని అటువైపు లిబర్టి వుండేది.

లిబర్టి సినిమాలో హిందీ, ఇంగ్లీష్ సినిమాలు వేస్తూండేవారు. ఆ బిల్డింగ్ సముదాయంలోనే 'ఫిలింస్ డివిజన్' ఆఫీస్ వుండేది. నేను గవర్నమెంటు సర్వీసులో వుండగా ఆ ఆఫీసుకి ఆడిట్‌కి పంపించారు. ఆఫీస్ అయాక లిబర్టికి వెళ్ళి ఏ సినిమానో చూసి, హోటల్‌కెళ్ళి భోంచేసి గదికి వెళ్ళేవాణ్ణి. లేదా ఫిలింస్ డివిజన్‌లో పనిచేసే ఒకతను ఆఫీస్‌లో బోర్ కొట్టినప్పుడల్లా ఓ పావుగంటో, అరగంటో సినిమా థియేటర్‌లో కూర్చునే ఏర్పాటు చేసేవాడు. దాదాపు నెల రోజులు నేను ఆడిట్‌లో వుండగా ఆ విధంగా లిబర్టిలో ఆడిన సినిమాలన్నీ చూసాను.

ఓ రోజు విదేశీ ఫిలిం ఫెస్టివల్‌కి ఫిలింస్ డివిజన్ వాళ్ళు నాకు

ఇన్విటేషన్ ఇచ్చారు. అది లిబర్టిలోనే వేసారు. నేను, ఓ ఫ్రెండ్ కలిసి ఆ ఫెస్టివల్‌కి వెళ్ళి సినిమా చూసాం. విదేశీ అన్ సెన్సార్డ్ సినిమా ఏమో, నగ్నదృశ్యాలు కోకొల్లలు.

లిబర్టి థియేటర్‌లో కనీసం వంద సినిమాలయినా చూసి వుంటాను. నేను పనిచేసే గవర్నమెంటాఫీసు శాంతినగర్, బేగం పేటలు మారి లిబర్టి దగ్గరలోని ఏ.జీస్ ఆఫీసులోకి వచ్చింది. లిబర్టి బస్‌స్టాప్‌లో బస్ ఎక్కి రెండో స్టాప్‌లో దిగితే, ఎదురుగా ఏ.జీస్ ఆఫీస్. అప్పట్లో నేను ఓ మిత్రుడు పదిహేను రోజులకి ఓసారి సాయంత్రం ఓ గంట పర్మిషన్, తీసుకుని నాలుగింటికో, మూడుం ముప్పావుకో బయటకి వచ్చేవాళ్ళం, రేషన్‌కార్డ్ ఆఫీసుకి వెళ్ళాలనో, ఇంకేదో కారణం చెప్పి. బస్ఎక్కి లిబర్టి బస్‌స్టాప్‌లో దిగి లిబర్టికి వెళ్ళేవాళ్ళం. ఇంగ్లీషు సినిమాలు ప్రదర్శించే థియేటర్లలో జంటనగరాల్లో మూడున్నరకి వేస్తారు మేట్నీలు.

ప్రకటనలు, న్యూస్‌రీల్ పోగా నాలుగింటికి మొదలయ్యేది మెయిన్ సినిమా. ఒకోసారి సినిమాని ఇంట్రవల్ తర్వాత వేసేవారు. ఆ విధంగా ఆఫీసుకి శెలవు పెట్టకుండా సినిమాలు చూసేవాణ్ణి. ముందే లిబర్టిలో అడిగితెలుసుకునేవాణ్ణి మేట్నీ మెయిన్ సినిమా ఎన్నింటికి మొదలవు తుందో.

నేను గర్ల్‌ఫ్రెండ్స్‌ని సినిమాలకి తీసుకెళ్ళింది ఎక్కువగా లిబర్టి కే అంటే అతిశయోక్తికాదు. 'చలతీకా నామ్ గాడీ'లో ఏ పాట విన్నా నాకు లిబర్టి థియేటర్, లత అనే ఓ అమ్మాయి గుర్తొస్తారు. నాలాగే చాలామంది కుర్రాళ్ళు ఆ రోజుల్లో గర్ల్‌ఫ్రెండ్స్‌తో వస్తూండేవారు.

టేంక్‌బండ్ దాటాక బషీర్‌బాగ్ వైపు వెళ్తుంటే రెండో ఎడమ సందులోకి తిరిగితే ఆ రోడ్డుమీద వుండేది లిబర్టి. ఆ రోడ్డు సరాసరి హిమాయత్ నగర్‌కి వెళ్తుంది. గోపిరంగు కలర్‌తో వుండే ఈ థియేట ర్‌లో పెద్ద క్లాసు టిక్కెట్‌కి మెయిన్ ఎంట్రన్స్‌లోంచి వెళ్ళాలి. చిన్న క్లాసు టిక్కెట్లకి కుడివైపు గేటులోంచి వెళ్ళాలి. మోటార్ సైకిల్స్‌స్టాండ్, కేంటీన్ అందులో వుండేవి.

అనేక సినిమా థియేటర్స్‌లో బ్లాక్‌లో టిక్కెట్లు అమ్మేవారు కాని

లిబర్టిలో మాత్రం ఎప్పుడూ అలా జరగడం చూడలేదు నేను. అప్పుడప్పుడు బెంగాలీ సినిమా మార్నింగ్ షోలు వేసేవారు. నేను 'ప్రతిద్వంది' అనే సత్యజిత్ రే సినిమా చూసింది లిబర్టిలోనే.

'రెండు రెళ్ళు ఆరు'లో అనుకుంటా ప్రేమికులు 'ఎంచక్కా బెంగాలి సినిమా కెళదాం. హాలు పలచగా వుంటుంది. తెలిసిన వాళ్ళెవరూ రారూ' అనుకుంటారు. ఈ 'ప్రతిద్వంది' అనుభవంతోనే అలా రాసాను ఇంగ్లీషు సినిమాలు రీ రన్స్ లిబర్టిలో అధికంగా వస్తూండేవి. కొత్త సినిమాలు శ్రీనివాసా, రామకృష్ణా, స్కైలైన్ లాంటి మంచి హాళ్ళలో వస్తే, ఓసారి ఆడినవి మళ్ళీ లిబర్టిలో వేసేవారు. కారణం ఏ.సి. లేదు. సూపర్ డీలక్స్ హాలు కాదు లిబర్టి. సగటు మధ్య తరగతి మహిళలా హుందాగా వుండేది తప్ప, ఏరోప్లేన్‌లలో తిరిగే హైక్లాస్ సొసైటీ లేడీస్‌లా వుండేది కాదు. డర్టి డజన్, ది గ్రేట్ ఎస్కేప్ లాంటి అనేక మంచి సినిమాలని మళ్ళీ చూడాలంటే లిబర్టికి వెళ్ళాల్సి వుండేది.

లిబర్టి సినిమాహాల్ లోని కేంటిన్‌లో టీ అంతగా బావుండేది కాదు. అంచేత ఇంట్రవల్‌లో ఎదురుగా వుండే ఇరానీ రెస్టరెంట్‌కి వెళ్ళి, సమోస తిని, టీ తాగేవాణ్ణి. ఇప్పుడా ఇరానీ రెస్టరెంట్ కూడా లేదు. ఆ స్థానంలో లిబర్టి ఎదురుగా ఓ సూపర్ బజార్ వుంది.

హాలీవుడ్‌లో సినిమాలు తీయడం తగ్గి ఇంగ్లీషు సినిమాలు రావడం ఆగిపోయాక లిబర్టి హాయిగా నడవడానికి కారణం ఈ రీరన్స్ వల్లే అని చెప్పవచ్చు.

ఏభై–అరవై ఏళ్ళ క్రితం కట్టిన, జంటనగరాల్లో ఇంగ్లీషు సినిమాలు చూపించే సినిమా థియేటర్ల పేర్లన్నీ ఇంగ్లీష్‌లో వుంటాయి. ప్లాజా, టివోలి, డ్రీమ్‌లేండ్, ఎంబసి, లైట్ హవుస్. ఆ కోవకు చెందిన లిబర్టి కూడా. క్రమంగా ఇంగ్లీష్ సినిమాలు ఆడే ఈ థియేటర్లు ఒక్కొక్కటే నిష్క్రమిస్తున్నాయి. అందులో ఆఖరుది లిబర్టి. ఇంకా లైట్‌హవుస్ మాత్రం నడుస్తోంది.

లిబర్టి సినిమా హాల్ పడగొట్టిన స్థానంలో ఓ పెద్ద అపార్ట్‌మెంట్స్ కాంప్లెక్సు రావచ్చు. లేదా ఆఫీసుల సముదాయం

రావచ్చు. అక్కడ ఏం కట్టినా దానికి 'లిబర్టి' అన్న పేరు పెడతారని ఆశిస్తాను. ఏ.జి. ఆఫీస్, సెక్రటేరియట్, ఎల్.ఐ.సి., రిజర్వ్ బాంక్ లాంటి చుట్టుపక్కల కార్యాలయాల్లో పనిచేసే వాళ్ళల్లో ఇంగ్లీష్ సినిమాలని నేను చూసిన 'పర్మిషన్' పద్ధతిలో చూసేవాళ్ళకి పెద్ద దెబ్బే. ఒక్క వాళ్ళకేకాదు లిబర్టి చావు ఇంగ్లీష్ సినిమా గోయర్స్‌కే కాక, హైదరాబాద్ వాసులందరికి లోపం కిందే లెక్క. వేసవిలో లిబర్టిలో మేట్నీ చూసి, నాలుగు నిమిషాలు నడక దూరంలో వున్న టేంక్ బండ్ కి వెళ్ళి కూర్చుని సేదతీర్చుకునే ఆదివారాలు ఎన్నో. ఇక మీదట అలాంటి ఆదివారాలు జంటనగర వాసులకి వచ్చే అవకాశం లేదు.

చిక్కడపల్లి, నారాయణగూడ, హిమాయత్‌నగర్, అశోక్‌నగర్, ఆదర్శనగర్.... ఇలా లిబర్టి చుట్టు పక్కల గల అనేక పేటల్లోని వారికి ఎంతో సేవచేసిన లిబర్టి లేకపోవడం పెద్దలోపమే. రెండో ఆటచూసి ఇంటికి నడిచి వెళ్ళడానికి ఇక లిబర్టి లేదు.

చివరగా ఓ ఎలిజీ. అమెరికాలో లిబర్టి స్టేచ్యూ వున్నంతకాలం హైదరాబాద్‌తో లిబర్టి పేరు నిలిచి వుంటుందని ఆశిస్తాను.

# మనస్తత్వాన్ని తెలిపే మీసాలు ఎట్సెట్రా

ఫ్రాయిడ్ పుణ్యమా అని మనస్తత్వ శాస్త్రం బాగా అభివృద్ధి చెందింది. విదేశాల్లో, ముఖ్యంగా అమెరికాలో ప్రతి మనిషి జీవితంలో ఓసారయినా సైకియాట్రిస్ట్ దగ్గరకి వెళ్ళకుండా వుండరు. కొందరు తరచు వెళ్తూంటారు. మెడికల్ ప్రొఫెషన్‌లో అమెరికాలో ఎక్కువ ఆర్జించేది సైకియాట్రిస్ట్‌లే,

సైకియాట్రిస్ట్‌లు తరచు కొన్ని విషయాల్లో పరిశోధన చేసి